క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

నిజాంసాగర్(జుక్కల్): ప్రయివేట్ పాఠశాలల యజమానులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని మహమ్మద్ నగర్ ఎంఈవో అమర్‌సింగ్ హెచ్చరించారు. గురువారం మహమ్మద్ నగర్, నిజాంసాగర్ మండలాల్లోని ప్రయివేట్ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకోండి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతు భరోస కోసం కొత్తగా పట్టాలు పొందిన రైతులు ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో శ్రావణ్ కుమార్ తెలిపారు. తాడ్వాయి రైతు వేదికలో గురువారం రైతుల నుంచి దరఖాస్తులను తీసుకున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డులు, బ్యాంకు అకౌంట్‌ల జిరాక్స్‌లు తీసుకురావాలని సూచించారు. అలాగే రైతు బీమా కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కందకాల తవ్వకం



లింగంపేట: మాలోత్ తండా శివారులోని అటవీ ప్రాంతంలో పోలీస్ పహారాలో అటవీ శాఖ అధికారులు కందకాలు తవ్వించినట్లు ఎల్లారెడ్డి రేంజ్ అధికారి ఓంకార్ తెలిపారు. తండా శివారులోని 732 కంపార్టుమెంటులో అటవీ భూమి ఆక్రమణకు గురి కాకుండా ఉండేందుకు అటవీ భూమి హద్దుల్లో కందకాలు తవ్విస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తండాకు చెందిన పలువురు అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసుల సహకారం తీసుకున్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డి రేంజ్ అధికారులు, లింగంపేట పోలీసులు, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపు

భిక్కనూరు: ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం సౌత్ క్యాంపస్‌లో భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకోవడానికి వర్షపు నీటి ప్రతి బిందువును వినియోగించడానికి రూఫ్ టాప్ పనులను ఎన్ఆర్ఈజీఎస్ సహకారంతో ప్రారంభించారు. సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ గౌడ్, భిక్కనూర్ ఏపీవో రాధిక, టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతి, లక్ష్మీనారాయణ, డాక్టర్ మోహన్ బాబు, డాక్టర్ ప్రతిజ్ఞ, హాస్టల్ వార్డెన్ డాక్టర్ యాలాద్రి, ఎస్. నారాయణ తదితరులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

గాంధారి(ఎల్లారెడ్డి): భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రేణుక చౌహాన్ అన్నారు. మండల పరిధిలోని నాల్గు గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోండి

పిట్లం(జుక్కల్): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజు నరేందర్ గౌడ్ పేర్కొన్నారు. పిట్లం జీపీ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించి ప్రజలు, రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మొత్తం 20 దరఖాస్తులు వచ్చాయని తమ పరిధిలో ఉన్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. ఉప తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ శీతల్, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు కంటి వైద్య పరీక్షలు

లింగంపేట(ఎల్లారెడ్డి): పోతాయిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించిననట్లు కంటి వైద్య నిపుణుడు హరికిషన్‌రావు తెలిపారు. ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు నిఖత్, ఫార్మాసిస్టు ఉమా, ఏఎన్ఎం స్వప్న, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపి శిబిరం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారుల బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత ఫిజియోథెరపి శిబిరం నిర్వహించారు. అనంతరం పిల్లలకు దుస్తులు, పుస్తకాల పంపిణీ, అక్షరభ్యాసం చేశారు. భవిత కేంద్రం ఇన్‌చార్జులు సారిక, భక్తమాల, ఫిజియోథెరపిస్ట్ జి.వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల కబ్జా





బొప్పాస్‌పల్లి వద్ద చదును చేసిన అటవీ భూములు



- లింగంపల్లి, బొప్పాస్‌పల్లి, హాజీపూర్, మైలారం శివార్లలో వందల ఎకరాలు మాయం
- పంట వేయడానికి ఏర్పాట్లు చేసిన వైనం
- చోద్యం చూస్తున్న అటవీ శాఖాధికారులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): ఒక వైపు ప్రభుత్వం అటవీ భూములను రక్షించాలని, వన సంపదను కాపాడాలన్న ఉద్దేశంతో పలు కార్యక్రమాలను చేపడుతోంది. కానీ మరో వైపు అటవీ భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. నస్రుల్లాబాద్ మండలం లింగంపల్లి, బొప్పాస్‌పల్లి, హాజీపూర్, మైలారం శివారులో గల అటవీ శాఖ భూములను చదును చేసి పంట వేయడానికి సిద్దంగా ఉంచారు. గతంలో కట్టెలు కొట్టేసిన అటవీ భూములు ప్రస్తుతం పంట వేసుకునేంతగా మడి కట్టలు కట్టి ఉంచారు. పంట వేసి తమ అధీనంలోకి తీసుకోవాలని కబ్జాదారులు ప్రణాళిక పన్నుతున్నారు. గ్రామాలకు కూత వేటు దూరం, నిత్యం జన సంచారం జరిగే ఈ ప్రాంతంలో వందల ఎకరాల మేర కబ్జా చేస్తున్నా కూడా అధికారులు పట్టించుకోవడం లేదు.

జిల్లా వ్యాప్తంగా అటవీ విస్తీర్ణం..

కామారెడ్డి డివిజన్‌లో 42,524.54 హెక్టార్లు, బాన్సువాడ డివిజన్‌లో 39,665.94 హెక్టార్లు అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. తాజాగా అధికారుల లెక్కల ప్రకారం.. ఒక్క కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ రేంజ్‌లో 800 ఎకరాలు, ఎల్లారెడ్డి రేంజ్‌లో 47.5 ఎకరాలు, కామారెడ్డి రేంజ్‌లో 247.25 ఎకరాలు, గాంధారి రేంజ్‌లో 703.65 ఎకరాల మేర అటవీ అంతరించి పోయిందని అంచనా.

ఇందులో అడవులకు నిప్పు అంటుకొని కొంత మేర అంతరిస్తే.. మరి కొంత అక్రమార్కుల ధనార్జన పాలైపోయింది. అయితే వీటిల్లో 2020–21 ఏడాదికి 2 వేల హెక్టార్ల అడవుల పునరుద్ధరణకు అడ్వాన్స్ ఆపరేషన్స్ చేస్తున్నామని అధికారుల చెబుతున్నారు.

రాత్రికి రాత్రే భూమి రూపు మార్పు

రాత్రికి రాత్రే భూమిలో చెట్లను కొట్టి చదునుకు ప్రయత్నం చేశారు. అయితే సంబంధిత వ్యక్తులపై కేసు పెట్టామని అటవీ శాఖ సిబ్బంది తెలిపి చేతులు దులుపుకున్నారు. అటవీ భూమిని సాగు భూమి మాదిరి మార్చి పంట వేయటానికి సిద్ధం చేశారు. కొచ్చరి మైసమ్మ, కంపల గండి, సంగం తదితర ప్రాంతాల్లో నిత్యం జన సంచారం ఉన్న ప్రాంతంలోనే ఇంత భూమి కబ్జా జరుగుతున్నా అధికారుల దృష్టికి రాలేదా అని ప్రజలు బాహాటంగానే చర్చిస్తున్నారు. ఈ ప్రాంతంలో అధికారుల విధి నిర్వహణ లోపం కారణంగా ప్రజలు కబ్జాకు పాల్పడ్డారన్న ఆరోపణలతో సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్‌లను బాధితులుగా చేసి గతంలో సస్పెండ్ చేశారు. జన సంచారం ఉన్న ప్రదేశంలో కబ్జా చేసిన వారిపై కేసులు పెట్టినా పలువురు మరి కొంత లోపలికి వెళ్లి చదును చేశారు.

చెట్లు నరికేస్తున్నా పట్టించుకోరా



కొచ్చరి మైసమ్మ ఆలయానికి వెళ్లడానికి వీలు కాకుండా చెట్లు ఉండేవి. కాని అధికార పార్టీ నాయకులే దగ్గరుండి చెట్లు నరికివేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడం లేదు. రాత్రికి రాత్రి ఇలా చదును చేస్తున్నారు. నిద్రమత్తులో సంబంధిత అధికారులున్నారు. చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– రవీందర్ గౌడ్, బైరాపూర్

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



ఎల్లారెడ్డి పోస్టాఫీస్‌లో మొక్కలను నాటుతున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డి: బీజేపీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ నాయకులు అన్నారు. గురువారం 11 ఏళ్ల బీజేపీ పాలన పూర్తయిన సందర్భంగా పోస్టాఫీస్‌లో బీజేపీ నాయకులు మొక్కలను నాటారు. బీజేపీ నాయకులు దేవేందర్, బాలకిషన్, నక్కగంగాధర్, కాశీ,రాజేష్, సతీష్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డు మరమ్మతులు ప్రారంభం

భిక్కనూరు: తిప్పాపూర్‌లో వృద్దుల సంఘం భవనం నుంచి మార్కెట్ జరిగే వీధి వరకు గుంతలమయంగా ఉన్న రోడ్డును కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి చొరవతో గురువారం అధికారులు మరమ్మతు పనులను ప్రారంభించారు. ప్రతి వారం జరిగే వార సంతలో రోడ్డు గుంతల మయంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ బీజేపీ నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బీజేపీ నేతలు బస్వారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మల్లేష్‌రెడ్డి బాబు, నర్సింలు, సాయిలు పాల్గొన్నారు.

యంత్రాలను భద్రపర్చరూ..!



బాన్సువాడ రూరల్: పంట నూర్పిడి కోసం వినియోగించే యంత్రాలు సీజన్ పూర్తికాగానే గాలికొదిలేస్తున్నారు. దీంతో అవికాస్త తుప్పు పడుతున్నాయి. మండలంలోని హన్మాజీపేట్, కాద్లాపూర్ గ్రామాల్లో రోడ్ల పక్కన ఉన్న పంట నూర్పిడి, శుభ్రం చేస్తే యంత్రాలను గోడౌన్‌లలో భద్రపర్చాలని అధికారులను రైతులు కోరుతున్నారు.



తాగునీటికి కటకట



మద్నూర్(జుక్కల్): లచ్చన్ గ్రామంలో తాగునీటి కోసం మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజుల నుంచి మిషన్ భగీరథ తాగునీరు రావడం లేదని వారు పేర్కొన్నారు. గ్రామంలోని పంచాయతీ కుళాయి ద్వారా కరెంట్ ఉంటేనే నీరు వస్తుందని ఈ మధ్య విద్యుత్ సరఫరా ఉండడం లేదని వారు వాపోతున్నారు. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. నిత్యం పది నిమిషాలే కుళాయిల ద్వారా నీరు వస్తుందని అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గురువారం గ్రామస్తులు కోరారు.



ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్లో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు, శిక్షకులు



అచ్చంపేట గురుకుల పాఠశాలలో..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఎల్లారెడ్డి/నిజాంసాగర్/భిక్కనూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని యోగ శిక్షకులు తెలిపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల యోగ గురించి వారు అవగాహన కల్పించారు. అనంతరం యోగాసనాలు వేయించారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ యోగా చేయాలని కోరారు.



భిక్కనూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మండల ఆయుష్మాన్ భారత్ వైద్యాధికారి

సోయాబీన్ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



మద్నూర్(జుక్కల్): మద్నూర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా ఉచితంగా అందిస్తున్న సోయాబీన్ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో రాజు సూచించారు. మండల కేంద్రంలోని కంపెనీ గోడౌన్‌లో గురువారం రైతులకు సోయాబీన్ విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కేవలం మద్నూర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీకి 990 బస్తాల సోయా విత్తనాలు వచ్చాయని చెప్పారు. కంపెనీ చైర్మన్ చాట్లావార్ గోపాల్, సిబ్బంది చందర్, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

ఎల్లారెడ్డిరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని 7వ వార్డులో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పొదలను తొలగించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. కాంగ్రెస్ నాయకుల ప్రశాంత్ తదితరులున్నారు.

యోగా దినోత్సవంలో అందరూ పాల్గొనాలి

ఎల్లారెడ్డి: ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరు పాల్గొనాలని యోగా శిక్షకులు నాగరాజు గౌడ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 5 గంటల నుంచి 7 వరకు యోగా కార్యక్రమం ఉంటుందన్నారు.

కామారెడ్డి అర్బన్: శనివారం ఉదయం 7 గంటల నుంచి 8 వరకు స్థానిక సరస్వతి విద్యామందిర్ హైస్కూల్ ప్రాంగణంలో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయుష్ డీపీఎం ఆకుల శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

కామారెడ్డి: హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10.45 గంటలకు స్థానిక మోహర్‌బాబా ఫంక్షన్ హాల్‌లో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్టు యోగా గురువు బండి రాములు, మహాదేవ్ స్వామిజీ తెలిపారు. యోగా అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాదం ఉంటుందన్నారు.

నేటి చిత్రం



ఆధార్ కేంద్రాన్ని తెరిపించాలి

రామారెడ్డి: మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో నిర్వహించే ఆధార్ సెంటర్ గత నెల రోజులుగా మూసి ఉంచారు. దీని గురించి నిర్వాహకులను అడిగితే సర్వర్ సమస్యతో మూసి ఉంచామని సమాధానం ఇస్తున్నారు. ఇటు రామారెడ్డి మండలంతో పాటు, సదాశివనగర్ మండలానికి చెందిన ప్రజలు రామారెడ్డి ఆధార్ సెంటర్లో ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం నిత్యం వస్తుంటారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి ఆధార్ సేవలను వినియోగంలోకి తేవాలి. – మహేష్ రామారెడ్డి

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200 | ఎల్లారెడ్డి : 97053 46576 | బాన్సువాడ : 94402 11363 | జుక్కల్ : 97053 46578

గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



రాజంపేట: గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని రాజంపేట ఎస్సై పుష్పరాజ్ అన్నారు. గుండారంలో గురువారం రాజంపేట పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. గ్రామాలలో దాతలు ముందుకు వచ్చి కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. కానిస్టేబుళ్లు చిరంజీవి, చరణ్ పాల్గొన్నారు.

భగీరథ పైప్‌లైన్ లీకేజీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రహ్మజీవాడి గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అవుతోంది. దీంతో ఆ స్థలంలో బురదమయంగా మారింది. లీకేజీ అయిన నీళ్లు తిరిగి పైపులైన్‌లోకి పోయి తాగునీరు కలుషితమవుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురియడంతో తాగు నీరు మరింత కలుషితమై ప్రజలు రోగాల బారిన పడే అవకాశముంది. అధికారులు స్పందించి వెంటనే పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీళ్ల లీకేజీ కాకుండా చర్యలు స్థానికులు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదివారం కార్మికులకు సెలవు ప్రకటించాలి



మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో బైఠాయించి ధర్నా చేస్తున్న కార్మికులు

కామారెడ్డి టౌన్: ప్రతి ఆదివారం కార్మికులకు సెలవు ప్రకటించాలని, తొలగించిన పాత కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, పైరవీలతో విధుల్లో చేరిన కార్మికులను తొలగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు రాజనర్సు డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు గురువారం బల్దియా కార్యాలయంలో ధర్నా చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో గంటపాటు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను ఖాతాల్లో జమచేయాలన్నారు. 60 ఏళ్ల వయస్సు నిండిన కార్మికుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. కమిషనర్ రాజేందర్‌రెడ్డితో వాగ్వాదం చేశారు. సమస్యలను పరిష్కరిస్తానని కమిషనర్ హామీతో ఆందోళన విరమించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్‌కుమార్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మహమ్మద్‌నగర్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అరుణతార

నిజాంసాగర్(జుక్కల్): పదకొండేళ్ల మోదీ సుపరిపాలనను పురస్కరించుకొని గురువారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో సంకల్ప సభ పోస్టర్లను బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కొండా అనిల్ గుప్తా, మహమ్మద్ నగర్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ నాయకులు సాయిలు, రాంప్రసాద్, సతీష్, రాములు, తదితరులున్నారు.

మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి

భిక్కనూరు: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార అన్నారు. ప్రధాని పాలన 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జంగంపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు .ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, మండల ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి, మండల అధ్యక్షులు ఉప్పరి రమేష్, తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్-పోతంగల్ గ్రామాల శివారులో మంజీర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆర్ఐ సాయిబాబా గురువారం పట్టుకున్నారు. మద్నూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తాడ్కోల్‌లో మొరం టిప్పర్..

బాన్సువాడ: బాన్సువాడ మన్సిపాలిటీ పరిధిలోని తాడ్కోల్ సమీపంలో బుధవారం రాత్రి మొరం టిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా మొరం తలిస్తున్నారనే సమాచారం రావడంతో టిప్పర్‌ను ఆపి, పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసి, టిప్పర్ యజమాని సాయగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంక్షిప్తం

అమ్మ మాట..అంగన్‌వాడీ బాట

సదాశివనగర(ఎల్లారెడ్డి): తిర్మన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం అమ్మమాట–అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడిటీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పదో తరగతి టాపర్‌కి నగదు అందజేత

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇటీవల పదవ తరగతి పరీక్ష ఫలితాలో అత్యధిక మార్కులు(558 మార్కులు) సాధించిన విద్యార్థి ఊడెం రాహుల్‌కు రూ. 5,116 నగదును పారితోషికంగా అందజేశారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న గ్రామానికి చెందిన కంది రవి నగదును అందజేశారు. హెచ్ఎం రాధా లక్ష్మీ, ఉపాధ్యాయులు పన్యాల బాపురెడ్డి, బాలకిషన్, నిర్మల, శ్రీనివాసులు శర్మ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పెన్నులు వితరణ

బీబీపేట: ఇస్సానగర్‌లో గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన కర్రోళ్ల అమ్ములు, కళ్యాణ్‌లు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. 120 మంది విద్యార్థులకు 500 నోటు పుస్తకాలు, పెన్నులు పలకలు అందజేశారు.

బోర్లంలో..

బాన్సువాడ రూరల్(బాన్సువాడ): బోర్లం హరిజనవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎంఈవో నాగేశ్వరరావు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫాంలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నేతలు నర్సింలు, దేవేందర్‌రెడ్డి, హెచ్ఎం సాయిరాం, తదితరులున్నారు.

అడ్లూర్ ప్రభుత్వ పాఠశాలలో..

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని అడ్లూర్ ప్రభుత్వ పాఠశాలలో రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం నోట్ బుక్స్ పంపిణి చేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు గుడుగుల శ్రీనివాస్, నాయకులు అజమాత్, ఆతీక్, అబ్దుల్, సిద్దిక్, హన్మాండ్ల రవి, జహంగీర్, జమీల్,తదితరులు పాల్గొన్నారు.

గురుకుల జూనియర్ కళాశాలలో..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం దేవునిపల్లి వాసవీ కాలనీలోని మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలలో కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థులకు గురువారం ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత నోటు పుస్తకాలను ప్రిన్సిపల్ ఇంతియాజ్ అలీ పంపిణీ చేశారు.

నాగిరెడ్డిపేట జూనియర్ కళాశాలలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం స్థానిక ఎంపీడీవో ప్రభాకరచారి అధ్యాపకులతో కలిసి పాఠ్యపుస్తకాలను అందజేశారు. గోపాల్‌పేట హైస్కూల్ హెచ్ఎం వెంకట్రాంరెడ్డి, అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కలను సంరక్షించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలోని మొక్కలను సంరక్షించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అలాగే గ్రామంలో ప్రతిరోజూ పారిశుద్య పనులు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌ను ఆదేశించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కామారెడ్డి & ఎల్లారెడ్డి

96034 62494
99122 20764

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899